కథ

# స్టార్ టీవీ




పొన్నపల్లి మైత్రీ మాధుర్య

ప్లాట్‌ఫామ్మీద పరుగెత్తి ఎలాగైతేనేం కదుల్తున్న ట్రైన్ ఎక్కగలిగాడు మోహన్. కాళ్ల మధ్య బ్రీఫ్ నిలబెట్టి కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుని క్రాఫ్ దువ్వుకొని టక్ సరి చేసుకుని రిలాక్సింగ్‌గా 'కింగ్ సైజ్' ముట్టించాడు. అప్పుడు గుర్తించాడది రిజర్వ్ కంపార్ట్‌మెంటని! టిసి. వచ్చి గొడవపెడితే? ఆ! ఓ టెన్‌పేపర్ కొడితే సరి! నో ప్రోబ్లమ్! అది అలవాటేగా!

ఆ బోగీలో మరో ముసలతను కూలిపని చేసుకునేవాడిలా వున్నాడు. అతగాడికీ మోహన్లాగే రిజర్వేషన్లేదు. టిసి. రాగానే మోహన్ తనే విధంగా 'పి.టి.ఉష' లా పరుగెత్తి ట్రయిన్ క్యాచ్ చేసిన ఉదంతమంతా చాలా స్పైసీగా చెప్పాడు. అంతా విని "ఓ.కే.!ఆర్డినరీ టిక్కెట్‌తో రిజర్వ్ బోగీ ఎక్కారు కనుక సిక్స్‌టీ రుపీస్ ఫైన్ కట్టండి!" తాపీగా అన్నాడు టిసి.! మోహన్‌కి టక్ వూడినంత పనయింది. "సారీ సర్ మూవింగ్ ట్రయిన్...క్యాచ్ చేసే ఎంగ్జయిటీలో ...సర్! "ఫార్మాలిటీస్" ఏవన్నా వుంటే చూసేద్దాం సర్! నో ప్రోబ్లమ్! ప్లీజ్! ఎంత బతిమాలినా టి.సి. ఒప్పుకోలేదు. అక్కడికీ ఆ మధ్య తను ఓ టెన్ ఇచ్చి సీటు తీసుకొన్న వైనం వివరించాడు మోహన్.

"చూడండి! రూల్సు మారాయి. టి.వి.ల్లో పబ్లిసిటీ యిస్తున్నారు. చూళ్లేదా? ఫైన్ కట్టాలి తప్పదు!"

"టి.వి.లో...చూడ్లేదండి!" అని ఏదో గుర్తుకొచ్చి "అంటే మాది స్టార్ టి.వి. సర్! అందుకని..."!టైని నీటుగా సర్దుకున్నాడు మోహన్.

"ఐ.సీ! కాని మీరు ఫైన్ కట్టాల్సిందే!" లాభం లేదని చుట్టూ అందరికేసి 'గిల్టీ'గా ఫీలవుతూ చూస్తూ అరవై రూ॥లు కట్టాడు మోహన్. రిసీట్ ఇచ్చి "నెక్స్ట్ స్టేషన్లో జనరల్ బోగీలోకి మీరు వెళ్లాలి!" అన్నాడో టి.సి. అదొకటి! అనుకున్నాడో మోహన్.

"ఏవయ్యా! నీ టిక్కెట్టేది?" టి.సి. అడగ్గానే ఆ కూలి మనిషి తన టిక్కెట్ చూపించాడు.

"చూడు నీది మామూలు టిక్కెట్ ఇది రిజర్వ్ బోగీ! అరవై రూపాయలు జరిమానా కట్టాలి నువ్వు!"

ఆ ముసలతను రెండు నోటు చూపించి "నా కాడ ఇదే ఉందయ్యా!" అన్నాడు అమాయకంగా.

అతగాడి ముఖంలో నిజాయితీని గ్రహించిన టి.సి. "వచ్చే స్టేషన్లో పక్కనే జనరల్ బోగీ వుంది. దాన్లోకి వెళ్లు తెల్సిందా?" అన్నాడు గట్టిగా. "అలాగే బాబయ్యా! తెలీక ఎక్కేశా నయ్యా!" అన్నాడా ముసలతను. టి.సి. ముందుకి కదుల్తూంటే మోహన్‌కి పాయింట్ దొరికి ఆర్గ్యూ చేసాడు.

"అదేం సార్! నా చేత అరవై కట్టించారు. అతన్ని వదిలేశారు. నేను కూడా నెక్స్ట్ స్టేషన్లో జనరల్ బోగీలోకి మారిపోతాను. నా అరవై నాకు రిటర్న్ ఇచ్చేయండి!" అన్నాడు మోహన్ దిగ్రేట్ సీరియస్‌గా.

అప్పుడా టి.సి.మోహన్‌వంక నిశితంగా చూసి నవ్వుతూనే కర్కశంగా అన్నాడు: "మీది 'స్టార్ టీవీ' కదా! మీరు ఫైన్ కట్టొచ్చులెండి! ఎటొచ్చి మీ స్టారే బాగులేదు!" అని ముందుకు వెళ్లిపోయాడు.

మోహన్ ముఖమ్మీద నెత్తురుచుక్క లేదు.